సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 27.635 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 6,238 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా) -	రూ.59,200
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,335
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,495
నవర (8 గ్రా) -	రూ.43,960


వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.2 /26.0

శనివారం గాలిలో తేమ 61 శాతం ఉంది. ఆదివారం జిల్లావ్యాప్తంగా పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి



శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులోని రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు శనివారం తెలిపారు. ఇందులో భాగంగా 1వ యూనిట్‌లో 420 మెగావాట్లు, 2వ యూనిట్‌లో 380 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. సాంకేతిక కారణాల వల్ల 3వ యూనిట్‌లో ఉత్పత్తి నిలిపివేసినట్లు వారు తెలిపారు.

3 నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నెల్లూరు(టౌన్): జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం నిర్వహిస్తున్న భవిత కేంద్రాల్లో కాంట్రాక్ట్ పద్ధతిన సహిత విద్య రిసోర్స్‌పర్సన్ల నియామకం కోసం ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వచ్చే అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ స్పెషల్ బీఈడీ/డీఈడీ, కుల, ఆర్‌సీఐ ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు గెజిటెడ్ అధికారులు ధ్రువీకరించిన రెండు సెట్లు జెరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. నెల్లూరులోని సమగ్రశిక్ష కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు.

రేపటి స్పందన రద్దు

నెల్లూరు(క్రైమ్): ఈ నెల 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

3.19 లక్షల మందికి వైఎస్సార్ పెన్షన్ కానుక

- నేటి నుంచి లబ్ధిదారులకు పంపిణీ

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 1వ తేదీ ఉదయం నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక నగదును పంపిణీ చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా 3,19,979 మంది లబ్ధిదారులకు రూ.88.93 కోట్ల నగదును పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశారు. వలంటీర్లు లబ్ధిదారులకు ఇంటికే వెళ్లి పింఛన్ నగదు పంపిణీ చేస్తారు. ఈ నెల 5వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుంది.

కళాకారుల గుర్తింపు కార్డు కోసం దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో కళాకారుల గుర్తింపు కార్డులు కావాల్సిన కళాకారులు ఈ నెల 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కె.సదారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాకారుల గుర్తింపు కార్డులు జారీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతికశాఖ నిర్ణయించిందని, జిల్లాలో వివిధ కళారంగాల్లో ఉన్న కళాకారులు గుర్తింపు కార్డు కోసం నిర్ణీత దరఖాస్తులో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, కలెక్టర్ కాంపౌండ్, నెల్లూరు వారికి పూర్తి చేసిన దరఖాస్తును పంపాలని పేర్కొన్నారు. దరఖాస్తు కోసం 9618432664 ఫోన్‌నంబర్‌లో కార్యాలయ వేళల్లో సంప్రదించాలని తెలిపారు.

ఏపీఆర్‌ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అల్లంపాటి

నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అల్లంపాటి పెంచలరెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అక్టోబర్ 2వ తేదీతో ప్రస్తుత ఏపీఆర్‌ఏ రాష్ట్ర కార్యవర్గం పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఈయన అక్టోబర్ 1వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

పల్లెల్లో ఆరోగ్య విప్లవం

రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువస్తోంది. అందరికీ సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముందుకుసాగుతోంది. ప్రజారోగ్యానికి పట్టం కడుతూ పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఇప్పటికే వైద్యారోగ్యశాఖలో ఖాళీ పోస్టులన్నింటినీ భర్తీ చేసింది. నాడు–నేడు కార్యక్రమం ద్వారా పీహెచ్‌సీ భవనాలను తీర్చిదిద్దింది. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తూ పల్లెల చెంతకే వైద్యసేవలను తీసుకువచ్చింది. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి గ్రామాల్లోనే ప్రజలకు వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుంది.

- జిల్లాలో ప్రారంభమైన 'జగనన్న ఆరోగ్య సురక్ష'
- ప్రజల నుంచి విశేష స్పందన
- 33 మండలాల్లో వైద్యశిబిరాలు
- తొలిరోజు వైద్యసేవలు పొందిన 6,398 మంది



పొదలకూరు మండలం దుగ్గుంటరాజుపాళెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్, జిల్లా ప్రత్యేకాధికారి హరికిరణ్

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యమే లక్ష్యంగా మరో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్ట్రంలోని ప్రతి ఇంటిని, ప్రతి కుటుంబాన్ని జల్లెడ పట్టి ప్రతి ఇంటి గడప వద్దనే ప్రజల ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి, ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా నిర్వహించిన వైద్యశిబిరాలకు వేలాదిగా తరలివచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని 45 రోజులపాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

తొలిరోజు విశేష స్పందన

తొలిరోజు జిల్లాలోని 33 మండలాల్లో ఒక్కొక్క మండలంలో ఒక్కొక్క వైద్యశిబిరం చొప్పున మొత్తం 33 శిబిరాలు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క శిబిరంలో నలుగురు వైద్యులు, ఐదుగురు సీహెచ్‌ఓలు, ఐదుగురు ఏఎన్‌ఎంలు, ఐదుగురు ఆశా కార్యకర్తలు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మాసిస్టులను నియమించి వైద్యసేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇలా జిల్లావ్యాప్తంగా 33 మండలాల్లో ఏర్పాటు చేసిన 33 వైద్యశిబిరాల్లో మొత్తం 132 మంది వైద్యులు, 165 మంది సీహెచ్‌ఓలు, 165 మంది ఏఎన్‌ఎంలు, 165 మంది ఆశా కార్యకర్తలు, 33 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 33 మంది ఫార్మాసిస్టులు పాల్గొని వైద్యసేవలు అందించారు. జిల్లాలో నిర్వహించిన వైద్యశిబిరాలకు మొత్తం 6,398 మంది ప్రజలు వచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు అవసరమైన పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే హాజరైన వారిలో 507 మందికి మెరుగైన వైద్యం అవసరం కావడంతో ప్రభుత్వ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు.



దుగ్గుంటరాజుపాళెంలోని వైద్యశిబిరంలో వృద్ధురాలికి బీపీ పరీక్షిస్తున్న సిబ్బంది

7 లక్షల మందికి పైగా వైద్యపరీక్షలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గత కొద్దిరోజులుగా జిల్లావ్యాప్తంగా వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆయా ఇంట్లోని వారికి బీపీ, షుగర్ తదితర ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. ఇప్పటి వరకు వైద్యసిబ్బంది 3,03,765 గృహాలను సందర్శించి 7,41,580 మందికి వైద్యపరీక్షలు చేశారు.

ప్రజలకు ఎంతో ఉపయోగం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంటి వద్ద వైద్య సేవలు అందించడం చాలా గొప్ప విషయం. వైద్యారోగ్యశాఖ పరంగా వైద్యుల నుంచి కిందిస్థాయి ఉద్యోగుల వరకు అందరికీ తగిన సూచనలు, ఆదేశాలు ఇస్తున్నాం. జిల్లాలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే కాకుండా ఇంటింటికీ వైద్యసేవలు అందిస్తాం.

– డాక్టర్ పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ

వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం జిల్లా కమిటీ నియామకం



అధ్యక్షుడిగా నియమితులైన డి.మహేంద్రనాథ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు డాక్టర్ల విభాగం జిల్లా కమిటీని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ప్రకటన వెలువడింది. అధ్యక్షుడిగా డి.మహేంద్రనాథ్‌రెడ్డి(నెల్లూరు సిటీ), ఉపాధ్యక్షులుగా డి.పెంచలసుబ్బయ్య(నెల్లూరురూరల్), ఐతంశెట్టి వెంకటేశ్వర్లు(కావలి), జనరల్ సెక్రటరీలుగా చెన్ను ప్రసాద్(కందుకూరు), డాక్టర్ దీప్తి మేకపాటి(ఆత్మకూరు), శ్రీరాం మనోహర్‌బాబు(కావలి), షేక్ అల్లాభక్షు(కోవూరు), చీకిలి రవీంద్రబాబు(సర్వేపల్లి), ఎస్.వేణుగోపాల్(నెల్లూరురూరల్), సెక్రటరీలుగా అలవాలపాటి శివనారాయణ(కందుకూరు), దోర్నాదుల మణిబాబు(కందుకూరు), సీహెచ్ ఆదిశేషయ్య(ఆత్మకూరు), బి.మాధురి(కావలి), వల్లూరు కాశీపతి(కావలి), తలారి సునీత(కోవూరు), నరసాపురం ప్రసాద్(నెల్లూరు సిటీ), తాతా సుబ్బారావు(సర్వేపల్లి), పళనిస్వామి బాలచంద్రశేఖర్(సర్వేపల్లి), జాయింట్ సెక్రటరీలుగా చింతలపూడి మౌనిక(కందుకూరు), షేక్ ముస్కాని(కందుకూరు), షేక్ మౌలాలి(కావలి), బద్దేలా రాజారమేష్(సర్వేపల్లి) నియమించింది. రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా అల్లారెడ్డి ఉదయభాస్కర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సూరపరాజు చక్రధరరావు నియమితులయ్యారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

- జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాలకు వైద్యనిపుణులు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్

పొదలకూరు: రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేసిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టి వైద్యనిపుణులను గ్రామాలకు రప్పించి వైద్యసేవలు అందిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు మండలం దుగ్గుంటరాజుపాళెం గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని కలెక్టర్ ఎం.హరినారాయణన్, వ్యవసాయశాఖ కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి హరికిరణ్‌లతో కలిసి మంత్రి కాకాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హెల్ప్‌డెస్క్, వైద్యవిభాగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందాలన్న తలంపుతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. వైఎస్సార్ తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి నాణ్యమైన వైద్యాన్ని పేదల ముంగిటకే తీసుకువచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 3,255 వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చి మెరుగైన వైద్యసేవలను అందిస్తోందని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, గ్రామాల్లో ఆరోగ్యకరమైన కుటుంబాలు ఉండాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఏడాదికొక పర్యాయం వైద్యపరీక్షలు : జిల్లా ప్రత్యేకాధికారి హరికిరణ్

ప్రతి ఒక్కరూ 40 ఏళ్లు దాటిన తర్వాత ఏడాదికొకపర్యాయం వైద్యపరీక్షలు చేయించుకోవాలని జిల్లా ప్రత్యేకాధికారి, వ్యవసాయశాఖ కమిషనర్ హరికిరణ్ సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైతే మెరుగైన వైద్యం కూడా అందిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వైద్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

గ్రామాలకే వైద్యనిపుణులు : కలెక్టర్ హరినారాయణన్

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యనిపుణులు గ్రామాలకే వచ్చి ప్రజలకు వైద్యసేవలు అందిస్తారని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. 104 వాహన సేవలకు భిన్నంగా 45 రోజులపాటు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు ఉంటాయన్నారు. ఇదే శిబిరంలో ఆరోగ్యశ్రీపై కూడా అవగాహన కల్పిస్తారని, చికిత్సపొందిన వారికి భవిష్యత్‌లో ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటారన్నారు. అనంతరం శిబిరానికి హాజరైన వారికి మంత్రి, జిల్లా ప్రత్యేకాధికారి, కలెక్టర్ కేస్‌షీట్స్ అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, సర్పంచ్ వెంకటరమణయ్య, ఎంపీటీసీ సభ్యుడు కె.రామిరెడ్డి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డిప్యూటీ కలెక్టర్ చినఓసులేసు, కోనం చినబ్రహ్మయ్య, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, తహసీల్దార్ వీరవసంతరావు, ఎంపీడీఓ నగేష్‌కుమారి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి న్యాయాధికారుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జయసూర్య, జస్టిస్ సుబ్బారెడ్డి

నెల్లూరు(లీగల్): నెల్లూరులోని జిల్లా కోర్టు కాంప్లెక్స్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా న్యాయాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా ఉన్న కోర్టుల్లో పెండింగ్ కేసులు, పరిష్కరించిన కేసులు, ఇతర కేసుల్లో సత్వర పరిష్కార మార్గాలు తదితర అంశాలపై చర్చించారు. జిల్లాలోని న్యాయమూర్తులకు పలు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా జడ్జి వెంకటకృష్ణయ్య, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని, జిల్లాలోని పలు కోర్టుల న్యాయమూర్తులు పాల్గొన్నారు.

ఏపీ హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన కలెక్టర్





హైకోర్టు న్యాయమూర్తులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి విచ్చేసిన ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జయసూర్య, జస్టిస్ సుబ్బారెడ్డిలను శనివారం కలెక్టర్ ఎం.హరినారాయణన్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రెవెన్యూ సమస్యలపై లోతైన అధ్యయనం

- అసిస్టెంట్ కలెక్టర్, మర్రిపాడు తహసీల్దార్ సంజనా సిన్హా



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలంలో సెప్టెంబర్ 3 నుంచి 30వ తేదీ వరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించడం ద్వారా రెవెన్యూ సమస్యలపై లోతైన అధ్యయనం చేయగలిగామని అసిస్టెంట్ కలెక్టర్ సంజనా సిన్హా తెలిపారు. శనివారం మర్రిపాడు తహసీల్దార్ కార్యాలయంలో 'సాక్షి'తో ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు. తాను తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టే నాటికి మర్రిపాడు మండలంలో 400 అడంగల్ మ్యుటేషన్ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, సాంకేతిక కారణాల వల్ల 33 తప్ప మిగిలినవన్నీ పరిష్కరించామని తెలిపారు. తగు ఆధారాలు రైతుల నుంచి సేకరించి చట్టబద్ధంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. పొంగూరు గ్రామంలో ప్రభుత్వ భూముల్లోకి రాకపోకలు సాగించే దారి సమస్య చాలా కాలంగా పెండింగ్‌లో ఉండగా స్థానిక రైతులతో మాట్లాడి పరిష్కరించామని తెలిపారు. అలాగే భూముల రీసర్వేకు సంబంధించి 3 రోవర్స్, 3 అధికారుల బృందాలతో వేగవంతంగా కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మర్రిపాడు మండలంలో హైలెవల్ కాలువ నిర్మాణం ద్వారా ఐదు రిజర్వాయర్ల ఏర్పాటు, కాలువల తవ్వకం, 3 జాతీయ రహదారుల నిర్మాణం తదితర ప్రభుత్వ కార్యకలాపాల వల్ల భూములకు విపరీతమైన గిరాకీ ఏర్పడిందని, అదే సమయంలో రెవెన్యూ వివాదాలు కూడా పెరిగాయన్నారు. నిబంధనల ప్రకారం అన్ని అంశాలను క్షేత్ర పరిశీలన చేశామన్నారు. నందవరం, చిలకపాడు, చిన్నమాచనూరు, కదిరినేనిపల్లి గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేశామని, పెగళ్లపాడు, ఇర్లపాడు, చాబోలు, పల్లవోలు గ్రామాల్లో భూముల రీసర్వే ముమ్మరంగా కొనసాగుతుందని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం మండలంలోని 43 పోలింగ్ స్టేషన్లకు 43 మంది బీఎల్‌ఓలను నియమించి ఓటర్ల జాబితా పకడ్బందీగా తయారు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. దాదాపు నెల రోజులుగా మర్రిపాడు మండలంలో తహసీల్దార్ బాధ్యతలు నిర్వహించిన తనకు స్థానిక ప్రజలు గొప్ప సహకారం అందించారని, సొంత ఇంట్లో ఉన్న భావనతో విధులు నిర్వహించగలిగానని చెబుతూ మండల ప్రజలకు ఆమె ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దగదర్తి డీటీ సస్పెన్షన్

నెల్లూరు(దర్గామిట్ట): దగదర్తి డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల చెంచయ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ హరినారాయణన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పట్టాదారు పాసుపుస్తకాల మంజూరులో అవకతవకలకు పాల్పడిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు.

నడిరోడ్డుపై తమ్ముళ్ల బాహాబాహీ

- టీడీపీ ఆఫీస్ బయటే పరస్పరం దాడులు
- ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదులు
- తమకు ప్రాణహాని ఉందన్న ఒక వర్గం నాయకుడు
- కేసులు నమోదు చేసిన పోలీసులు

కావలి: పట్టణంలో టీడీపీ నాయకులు మారణాయుధాలు చేత పట్టి నడిరోడ్డుపై తన్నుకుంటూ, దుర్భాషలాడుకున్నారు. శనివారం మధ్యాహ్నం పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్దే ఇరువర్గాల వారు బాహాబాహీకి దిగారు. పరస్పరం దాడులు, ప్రతి దాడులు చేసుకున్నారు. ఒక వర్గానికి కావలి పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు నాయకత్వం వహిస్తుండగా, మరొక వర్గానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు నాయకుడు. ఈ రెండు వర్గాలు గత కొన్ని నెలల్లో ఇలా రోడ్డుపై కొట్లాడుకోవడం ఐదోసారి ఆ పార్టీ నేతలు వాపోతున్నారు. టీడీపీ వర్గాల కథనం మేరకు.. పార్టీలో మలిశెట్టి వెంటేశ్వర్లు ఆధిపత్యాన్ని ప్రశ్నించే విధంగా బాబురావు వ్యవహరిస్తుండగా, మలిశెట్టి కూడా ఆయనకు పార్టీలో చెక్ పెట్టే విధంగా పావులు కదుపుతున్నాడు. ఈ నేపథ్యంలో ఏడాది క్రితం ఎన్టీఆర్ విగ్రహం సాక్షిగా నేరుగా మలిశెట్టి వెంకటేశ్వర్లు, జ్యోతి బాబురావు రోడ్డుపైనే బూతులు తిట్టుకుంటూ కొట్టుకుని చొక్కాలు చింపుకున్నారు. అప్పట్నుంచి వారిద్దరి నడుమ విభేదాలు ముదిరి పాకానపడ్డాయి. కాగా మలిశెట్టి వెంకటేశ్వర్లు భార్య విజయలక్ష్మి మాజీ కౌన్సిలర్ కావడంతో ఆ పార్టీలో క్రియాశీలకంగా ఉంటున్నారు. శుక్రవారం జరిగిన పార్టీ కార్యక్రమంలో తనతో పాటు ఉన్న మహిళలను జ్యోతి బాబురావు జుగుప్సాకరంగా మాట్లాడాడని విజయలక్ష్మి ఆరోపణలు చేసింది. ఈ అంశంపై పార్టీ ఇన్చార్జి మాలేపాటి సుబ్బానాయుడుకు ఫిర్యాదు చేసేందుకు పార్టీ ఆఫీస్‌కు వెళితే బాబురావు తన అనుచరులతో మారణాయుధాలతో దాడులు చేయించాడని మలిశెట్టి వెంకటేశ్వర్లు వర్గం కావలి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మలిశెట్టి భార్య విజయలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికి బాబురావు ఐదుసార్లు తమపై దాడులు చేశాడని, ఈ విషయాన్ని మాలేపాటి అంగీకరించాడని చెప్పారు. ఇకనైనా ఆయనపై చర్యలు తీసుకోకపోతే తాము ఎంత దూరమైనా పోతామని ఆమె తేల్చి చెప్పారు. ఇక జ్యోతి బాబురావు కూడా మలిశెట్టి వర్గంపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీని అడ్డం పెట్టుకుని అక్రమంగా సంపాదించే అలవాటు ఉన్న మలిశెట్టి వెంకటేశ్వర్లుకు తాను అడ్డంగా ఉన్నాని తనపై కోపమన్నారు. ఎన్నికలు వస్తుండడంతో తనను పార్టీలో లేకుండా చేయాలని కుట్రలు పన్ని, చంపేయాలని పథకం రచించాడని ఆరోపించారు. టీడీపీ ఇన్చార్జి మాలేపాటి తనను పార్టీ కార్యాలయం గదిలోకి తీసుకెళ్లి తాళం వేయడంతో బతికానని, లేకపోతే ఈ రోజే చంపేసి ఉండేవారని పేర్కొన్నారు. కాగా ఇరువర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్లు కావలి వన్ టౌన్ సీఐ కే శ్రీనివాసరావు తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:127
లేయర్ (లైవ్)	:118
బ్రాయిలర్ చికెన్	:220
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:246
లేయర్ చికెన్	:200



గంజాయి అక్రమ రవాణాపై దాడులు

- 9 కేజీల గంజాయి స్వాధీనం
- ముగ్గురి అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): గంజాయి అక్రమ రవాణాపై నవాబుపేట పోలీసులు దాడి చేశారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 9 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి నవాబుపేట పోలీసుస్టేషన్‌లో నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి నిందితుల వివరాలను వెల్లడించారు. అనంతపురం జిల్లా ముదిగుబ్బ మండలం కొండగట్టుపల్లికి చెందిన షావలి డ్రైవర్. విధి నిర్వహణలో భాగంగా తరచూ ఒడిశాకు వెళ్లేవాడు. ఈ క్రమంలో గంజాయికి బానిసయ్యాడు. సులభంగా నగదు సంపాదించేందుకు గంజాయి విక్రయాలను ప్రారంభించాడు. ఒడిశా నుంచి గంజాయిని తీసుకొచ్చి నెల్లూరు నగరం, అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోసాగాడు. వైఎస్సార్ జిల్లా తేరేనామ్‌పల్లిలో నివాసం ఉంటున్న తన అక్క సబీరా, నెల్లూరులోని మూలాపేటలో ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్న షేక్ ఫైరజ్, మరో వ్యక్తిని వ్యాపారంలో భాగస్వామ్యం చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు సాగిస్తున్నారు. శనివారం షావలి, సబీరా, ఫైరజ్ గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం నవాబుపేట ఇన్‌స్పెక్టర్ ఎం బాబికి అందింది. దీంతో ఆయన తన సిబ్బందితో కలిసి ప్రశాంతినగర్ జంక్షన్(జాతీయ రహదారి)వద్ద మాటు వేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2 లక్షల విలువచేసే 9 కేజీల 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను పోలీసుస్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించారు. ఒడిశాలో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి నెల్లూరు, అనంతపురం, కడప జిల్లాల్లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు వెల్లడించడంతో అరెస్ట్ చేశారు. నెల్లూరులోని కొందరు గంజాయి విక్రేతల పేర్లు వెల్లడించడంతో వారి కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్ ఎం బాబి, ఎస్సైలు బీ శివప్రకాష్, ఎస్‌ఏ రెహమాన్, సిబ్బంది జీ వెంకటేశ్వర్లు, ఆర్వీ రత్నం, ఎస్ సురేంద్రబాబు, బీ మోహన్‌బాబు, ఎం వేణు, జీ మస్తానయ్య, డీ శ్రీనిజను డీఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఎం బాబి, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం ఉపకారవేతనాలకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు(దర్గామిట్ట): 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి వృత్తి విద్యా డిగ్రీ కోర్సులు చేస్తున్న మాజీ సైనికుల పిల్లలకు ప్రధాన మంత్రి ఉపకారవేతన పథకం కింద ఉపకారవేతనాలు మంజూరు చేస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి పీఎస్ రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ సైనికుల కుమారులకు రూ.30 వేలు, కుమార్తెలకు రూ.36వేలు వంతున ఉపకారవేతనాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై నవంబర్ 30లోగా కళాశాలల్లో చేరిన విద్యార్థులు మాత్రమే అర్హులని చెప్పారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేసిన మాజీ సైనికుల పిల్లలు కేంద్రీయ సైనిక్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా ఉపకారవేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు నెల్లూరులోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం సంప్రదించాలని కోరారు.